




ఇంకా ఏడు రోజులే..

ఈ నెలాఖరుతో ముగియనున్న సర్పంచ్‌ల పదవికాలం

- పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలనేనా..?!
- గ్రామ పంచాయతీ ఎన్నికలపై సందిగ్ధం
- జిల్లాలో మొత్తం 461 జీపీలు

మహబూబాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రగతికి పట్టుకొమ్మలు గ్రామాలు. అవి అభివృద్ధి చెందితేనే.. దేశం అన్నిరంగాల్లో ముందుకెళ్తుంది. అలాంటి గ్రామ పంచాయతీల విషయంలో పాలకులు ముందస్తు ప్రణాళికలు చేపట్టడం లేదు. ప్రధానంగా గ్రామ పంచాయతీ పరిపాలనలో కీలకమైన పాలక మండళ్ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో పంచాయతీల ఎన్నికల నిర్వహణపై ఇంకా సందిగ్ధత పరిస్థితులే కన్పిస్తున్నాయి.

సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయ్యాక.. ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకుంటే ప్రత్యేకాధికారుల పాలన అమలు తథ్యమన్న అభిప్రాయం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దశాబ్దకాల అనంతరం మూడోదఫా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అయితే బీసీ రిజర్వేషన్లు పెంచే యోచనలో రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు ఉండడంతో పంచాయతీ ఎన్నికల జాప్యం అనివార్యంగా మారనుంది.

జిల్లాలోని 18 మండలాల్లో..

మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాల్లో 461 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో 4,030 వార్డులున్నాయి. వీటికి 2019లో జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఫిబ్రవరి 2న గ్రామపంచాయతీల్లో కొత్త పాలక మండళ్లు కొలువు తీరాయి. ఈ పాలకమండళ్ల సరిగ్గా ఈ ఏడాది ఫిబ్రవరి 1తో పదవీకాలం ముగియనుంది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ప్రకారం పదవీకాలం ముగియగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ ఏదైనా కారణాలతో ఎన్నికలు నిర్వహించలేకపోతే ప్రత్యేకాధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలి. పదవీకాలం ముగుస్తున్నప్పటికీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా రాష్ట్రప్రభుత్వం ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదు.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీసీల రిజర్వేషన్ అంశంతో ముడిపడడంతో పాటు పార్లమెంటు ఎన్నికలు సైతం ఉండడంతో గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే అవకాశం కనిపించడం లేదు. పదవీకాలం ముగుస్తోండడంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించి, కొత్త పాలకమండలి కొలువుదీరే వరకు ప్రత్యేకాధికారుల పాలన ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మేజర్ గ్రామపంచాయతీలకు మండలస్థాయి అధికారులు, అంతకంటే చిన్న జీపీలకు వివిధ ప్రభుత్వశాఖల్లో సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణాధికారులు, మార్కెట్ ఉద్యోగులు, వీఆర్‌పీ స్థాయి ఉద్యోగులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారని తెలుస్తోంది.

> **కరోనా సంక్షోభంతో ఏడాది పొడిగించాలని సర్పంచ్‌ల వినతి**
>
> ఈ ఐదేళ్ల కాలంలో 2020, మార్చిలో ఎవరూ ఊహించని విధంగా కరోనా సంక్షోభం రావడంతో ఏడాదికిపైగా నిధుల లేమితోనే గ్రామపంచాయతీలు కాలం వెల్లదీశాయి. ఈ నేపథ్యంలో మరో ఏడాది పాటు తమ పదవీకాలం పొడిగించాలని సర్పంచులు కోరుతున్నారు. గత పంచాయతీ రాజ్ చట్టంలో పదవీకాలం ముగిసిన సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించే అవకాశం ఉండగా నూతన పంచాయతీరాజ్ చట్టం-2018లో పర్సన్‌ఇన్‌చార్జిల నియామకం అంశాన్ని ప్రస్తావించ లేదు. సర్పంచులను పదవీకాలం పొడిగించాలంటే పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాల్సి ఉంటుంది. ఏదేమైనా వచ్చేనెల నుంచి గ్రామాల్లో పాలనాధికారంలో మార్పు రానుందనేది వాస్తవం!

ఇన్‌చార్జిలతోనే కాలం వెల్లదీత..

జిల్లాలో ఈ ఐదేళ్లలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ స్థానాల్లో ఇన్‌చార్జిలతోనే పరిపాలన కొనసాగింది. కీలకమైన సర్పంచ్ పదవులు ఖాళీగా ఉన్నప్పటికీ, వాటి స్థానాలకు ఎన్నికలు నిర్వహించి భర్తీ చేయాల్సిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. నూతన పంచాయతీ రాజ్ చట్టం నిబంధనల ప్రకారం రాజీనామా చేసిన, చనిపోయిన ప్రజాప్రతినిధుల స్థానంలో ఆరు నెలల్లో గా ఎన్నికలు నిర్వహించాలి. ఐతే ఉప ఎన్నికలు నిర్వహించేందుకు 2019లో సన్నాహాలు చేసినప్పటికీ ప్రభుత్వం ఎందుకనోవెనుకకు తగ్గింది. మూడేళ్ల క్రితం ఓటరు జాబితా సవరణలు పూర్తి చేసుకొని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రాగానే నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు.

జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన 6 సర్పంచ్‌లు, 20 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 2019, సెప్టెంబరు నెలలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు స్థానాల్లో ఫొటోలతో కూడిన ఓటరు జాబితాను ఆయా గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు ప్రదర్శించారు. ఖాళీగా ఉన్నస్థానాల్లో ఓటర్ల జాబితాను సైతం సిద్ధం చేసి, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపించారు. ఆ తదుపరి ప్రభుత్వంనుంచి ఆదేశాలు రాకపోవడంతో ఉపఎన్నికల ఊసే లేకుండా పోయింది. ఆయా గ్రామాల్లో ఈ ఐదేళ్లకాలంలో ఉపసర్పంచ్‌లను ఇన్‌చార్జి సర్పంచులుగా, వార్డు సభ్యుల్లో ఒకరిని తాత్కాలిక ఉప సర్పంచులుగా నియమించి గ్రామపంచాయతీల్లో పాలన కొనసాగించారు.

పెండింగ్ బిల్లులపై సర్పంచుల ఆందోళన

పదవీకాలం ఈ నెలఖరుతో ముగుస్తున్న సర్పంచులు మాత్రం పెండింగ్ బిల్లులపై తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల్లోంచే గ్రామపంచాయతీల్లో నిర్వహణ సిబ్బంది అరకొరగా ఇస్తూ కాలం నెట్టుకొచ్చారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) అందించే నిధుల్లోంచే సిబ్బంది వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులను దాదాపు ఏడాదిగా ఇవ్వకపోవడంతో కేంద్ర నిధులను జీపీల నిర్వహణ కోసం వెచ్చించక తప్పని పరిస్థితి సర్పంచులకు

- మిగతా 6వ పేజీలో



> **బిల్లులు వచ్చేంత వరకు కొనసాగించాలి..**
>
> **గుగులోత్ వెంకన్న, కేసముద్రం మండలం సబ్‌స్టేషన్‌తండా, సర్పంచ్**
>
> మా జీపీకి రూ.12 లక్షల బిల్లులు రావాల్సినవి ఉన్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది జీతాలకు, ఇతర ఖర్చులకు అప్పులు తీసుకువచ్చి చెల్లించా. కరోనా సంక్షోభంలో ఏడాదికాలం పాలన కొనసాగలేదు. వీటిని దృష్టిలో పెట్టుకొని పదవీకాలాన్ని మరో ఏడాది పాటు పొడిగించాలి.

మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మిర్చి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న జాటోతు రాంచంద్రునాయక్

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 23 : మానుకోట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారిస్తానని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మిర్చి కొనుగోళ్లను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. మార్కెట్‌కు వచ్చిన రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. మార్కెట్ యార్డు ప్రస్తుతం సరిపోవడం లేదని, మరో 20 ఎకరాల స్థలం అవసరమని మార్కెట్ స్థలం విషయం, అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. మార్కెట్ యార్డులో రైతులు, కూలీల కోసం రూ.5 భోజన పథకం కూడ అమల్లోకి తీసుకువస్తామని వివరించారు. మిర్చి కొనుగోళ్ల అంశంలో వ్యాపారులు రైతులకు సహకరించాలని, రైతుల కష్టాన్ని గుర్తించి అధిక ధరలు వచ్చే విధంగా విశాల హృదయంలో చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ విద్యాసాగర్, మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్, వ్యాపారులు దీపక్, విజయ్, సంజయ్, రాజు, శ్రీనివాస్, ఓంనారాయణ, గుండా నాగేశ్వరావు పాల్గొన్నారు.

మిర్చి క్వింటాకు రూ.20,925..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొదటిరోజు మిర్చి కొనుగోళ్లు జరిగాయి. 633 లాట్లు మిర్చి యార్డుకు వచ్చింది. క్వింటా గరిష్ట ధర రూ.20,925 ధర పలుకగా కనిష్ట ధర రూ.10,513 పలికింది. మోడల్ ధర రూ.18,699గా ఉంది.

మొదటి రోజే లొల్లి..



మార్కెట్‌లో ఛైర్మన్ ఎదుట ఆందోళన చేస్తున్నరైతులు

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్ల ప్రారంభమైన మొ దటి రోజునే గేట్ ఎంట్రీ చీటిలు ఇవ్వాలని రైతులు మార్కెట్ ఛైర్మన్, అధికారుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మార్కెట్‌కు మిర్చి తీసుకు వచ్చిన గేటు ఎంట్రీ చీటిలు కేటాయించలేదని, తమకు వెనుకాల వచ్చిన గేట్ ఎంట్రీ చీటిలు ఇచ్చారని, తమకు ఎందుకు ఇవ్వరని మార్కెట్ ఛైర్మన్ విద్యాసాగర్, కార్యదర్శి శంషీర్‌ను ప్రశ్నించారు. మీరు ఆలస్యంగా రావడంతో గేట్ ఎంట్రీ చిటీలుఇవ్వలేదని సాయంత్రం ఇస్తామని చెప్పినప్పటికి వారు వినలేదు. చివరకు ఛైర్మన్ గేట్‌చీటిలు రైతులు ఇవ్వాలని ఆదేశించడంతో.. ఆయన చాంబర్ లోనే కార్యదర్శి చిటీలు ఇచ్చారు. దీంతో రైతుల లొల్లి సద్దుమణిగింది.

బాలుడిపై వీధికుక్కల దాడి



గాయపడిన వినయ్

చిన్నగూడూరు, జనవరి 23 : వీధి కుక్కల దాడిలో ఓ బాలుడు గాయపడిన ఘటన ఉగ్గంపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన ఏనుగంటి వినయ్ (8) సాయంత్రం తాత దర్గయ్యతో కలిసి పశువులను తనఇంటి సమీపంలో కట్టేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా బాలుడుపై కుక్కలు దాడిచేసి, గాయపరిచాయి. గమనించిన తాత, స్థానికులు కుక్కలను చెదరగొట్టి గాయాలతో ఉన్న వినయ్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధికుక్కల దాడులు నిత్యకృతమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మానుకోట జంక్షన్‌లో సీపీఐ ఆందోళనలు

- మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన జీవో ప్రతుల దహనం



అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 23 : మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, అవి విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం మానుకోటలోని జంక్షన్‌లలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. మూడుకొట్ల సెంటర్, సర్వేపల్లి రాధాకృష్ణన్ సెంటర్, అంబేద్కర్ సెంటర్లలో ఆందోళనలు చేపట్టి పూర్వ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిధులను మంజూరు చేస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 34, 367 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగాసీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో అప్పటి సీఎం కేసీఆర్ మానుకోట మునిసిపల్ అభివృద్ధికి రూ.50 కోట్లు, మంత్రి కేటీఆర్ పలువార్డుల అభివృద్ధికి రూ.2 కోట్లు నిధులను మంజూరు చేస్తున్నామని ప్రకటించి, వాటిని విడుదల చేయలేదని ఆరోపించారు. నిధులు మంజూరు చేస్తామని చెప్పి విస్మరించిన కేసీఆర్, కేటీఆర్ దగాకోరులను విమర్శించారు. కార్యక్రమంలో పెరుగకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, పాండురంగాచారి, సాంబలక్ష్మి, రవి, జ్ఞానేశ్వర్, యాకమ్మ, పద్మ, శంకర్, రమేష్, నక్క నాగార్జున, శ్రీనాథ్, రాణి, జమున పాల్గొన్నారు.

తప్పనిసరి తనిఖీలు అంటూ..

గ్యాస్ వినియోగదారుల వద్ద డబ్బుల వసూళ్లు

డోర్నకల్, జనవరి 23 : మునిసిపల్ కేంద్రంలోని బంకట్‌సింగ్ తండాలో మంగళవారం హిందుస్తాన్ పెట్రోలియం, ఐఓసీ గ్యాస్ వినియోగదారుల ఇళ్లలో కొందరు వ్యక్తులు వచ్చి, తాము ఆయా కంపెనీలకు చెందిన సిబ్బందిమని చెబుతూ.. వినియోగదారుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారు. దీంతో మాజీవార్డు సభ్యురాలు బానోత్ సరళశ్రీరాం వారిని మీరు ఎవరు.. ప్రజల వద్ద నుంచి ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వారిని ప్రశ్నించింది. దీంతో తాము ఆయా కంపెనీల నుంచి వచ్చామని, గ్యాస్ స్టౌ, రెగ్యులేటర్, గ్యాస్ పైపులను తనిఖీ చేసి సురక్షితంగా ఉన్నాయా..! లేదా? అని పరిశీలిస్తున్నామన్నారు. ఇందుకు గాను సర్వీస్ చార్జీలరూపేనా రూ.236 వినియోగదారుల వద్ద నుంచి వసూలు చేస్తున్నామని సమాధానం ఇచ్చారు. దీంతో ఆయా కంపెనీల ఆదేశాలు తమకు చూపించాలని, అప్పటి వరకు తనిఖీలను ఆపాలని సిబ్బందికి సరళ సూచించారు. దీంతో వినియోగదారుల వద్ద నుంచి తొలుత వసూలు చేసిన డబ్బులను వారికి చెల్లించి, అక్కడ్నుంచి వెళ్లిపోయారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికైనా ఈ విషయంపై స్పందించి, ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సరళ కోరారు.

మహాజాతర పనుల్లో అలసత్వం వద్దు

- జాప్యం చేస్తే చర్యలు తప్పవు
- అధికారులపై గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ఫైర్
- మేడారంలో పలు శాఖల పనితీరుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

మేడారం(ములుగు), జనవరి 23 : మహాజాతర పనుల్లో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్ అన్నారు. ఆయా పనుల్లో జాప్యమవుతోందని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారంలో ఆయన గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇ.వెంకటనర్సింహరెడ్డి, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం పర్యటించారు. వనదేవతల మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. మేడారంలోని సమ్మక్క భవనంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని జాతర శాశ్వత, తాత్కాలిక పనుల పురోగతిపై సమీక్షించారు. పనుల్లో జాప్యం జరుగుతోందని, వేగవంతం చేసి ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతరకు ముందస్తుగా మేడారానికి వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ స్థలంలో ఎన్ని వాహనాలను పార్కింగ్ చేయొచ్చో తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మేడారం దుకాణాలు, స్టాల్స్ వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అన్నారు. ముందస్తుగా వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగులో లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ఇసుక లెవలింగ్ పనులను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. జాతర పరిసరాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. గత జాతరల్లో చోటుచేసుకున్న సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. అత్యవసర వైద్యం కోసం వీలైనంత ఎక్కువ సంఖ్యలో మినీ అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. భక్తుల సౌకర్యాల కల్పనలో రాజీపడొద్దని, అన్ని పనులూ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పేలా మేడారం మహాజాతరను ఘనంగా నిర్వహించాలన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మధుర జ్ఞాపకాలు గుర్తుండిపోయేలా పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకటనర్సింహరెడ్డి మాట్లాడుతూ మహాజాతరను విజయవంతం చేయడానికి ఎవరికి కేటాయించిన పనులను వారు సమర్థంగా చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పోలీసు శాఖతో సమన్వయంగా బందోబస్తు వ్యవస్థను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఆయా శాఖల అధికారులు టీమ్‌వర్క్ చేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ములుగు ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ అశోక్‌కుమార్, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న కౌన్సిలర్‌లు

తొర్రూరు, జనవరి 23 : మునిసిపాలిటీల పరిధిలో ప్రజల అవసరాల మేరకు ప్రణాళికా ప్రకారం అవసరమైన పనులను చేపట్టాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరులో నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి ఆమెముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న పనులను ముందస్తు అవసరాల మేరకు ప్రణాళికంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను కూడా మంజూరు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

సమస్యల గోడు వెల్లబోసుకున్న కౌన్సిలర్లు..

పట్టణంలో పలు సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని మునిసిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేని కోరారు. తాగునీటి ఇబ్బందులతో పాటు కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అంగడి ప్రహరీ నిర్మాణం రూ.కోటి తో పూర్తి చేసినా నిరుపయోగంగా ఉందని, పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో జరగడంలేదని వీధిదీపాలు, కరెంట్ స్తంభాల కొరత తీవ్రంగా ఉందన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో నూతనంగా వెలసిన కాలనీలకు విద్యుత్ లైన్‌లు నిర్మించి కరెంట్ కనెక్షన్‌లు ఇవ్వాలన్నారు. రోడ్డు వైండింగ్ పనులు పూర్తి చేయాలని, ప్రధానంగా సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు, తాగునీరు తదితర సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు.

'ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి'

మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో అన్నారు. మునిసిపల్ జనరల్ బాడీ సమావేశానికి హాజరై మాట్లాడారు. తొర్రూరు పట్టణంలో తాగునీటి కొరత, అవసరం మేరకు కరెంట్ పోల్స్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలన్నీ మునిసిపాలిటీలో తీర్మానాలు పెట్టి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ రాంచంద్రయ్య, వైస్‌ఛైర్మన్ సురేందర్ రెడ్డి, కమిషనర్ సరస్వతి, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 23 : జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలతో పాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మైనారిటీ విద్యార్థుల సీట్ల కేటాయింపులో తొలుత దరఖాస్తు చేసుకున్న నెంబర్ ప్రాధాన్యత ప్రకారం సీటు కేటాయించడం జరుగుతుందన్నారు. నాన్‌మైనారిటీ విద్యార్థుల ఎంపిక లక్కీ డ్రా ద్వారా ఉంటుందన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 73311 70852, 99081 10316లను సంప్రదించాలన్నారు.

బహుజన రాజ్యస్థాపనే లక్ష్యం

ఆర్‌పీఐ రాష్ట్ర సమన్వయ కర్త జన్ను సాంబయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌పీఐ నేతలు

వడ్డెపల్లి, జనవరి 23: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను సంఘటిత పరిచి బహుజన రాజ్యాన్ని స్థాపించడమే పార్టీ లక్ష్యమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర సమన్వయ కర్త జన్ను సాంబయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పేదలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొంత ఇల్లు, స్థలం లేని ప్రతీ కుటుంబానికి మూడు గుంటల స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ఆర్‌పీఐ నేత బొజ్జాతారకం సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 28న హనుమకొండలో నిర్వహించే ఆర్‌పీఐ రాష్ట్ర సదస్సులో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో సామాజిక, రాజకీయ విశ్లేషకుడు సాయిని నరేందర్, ఆర్‌పీఐ నేతలు సింగారపు అరుణ, మైదం జైపాల్, రాచకొండ ప్రవీణ్‌కుమార్, భవాని ప్రసాద్, కూనూరు రంజిత్‌గౌడ్, అన్వేష్, సాంబశివరాజు, సాగర్, రాజు, గణేష్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, జనవరి 23: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురువారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్‌2 నోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు


ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తర ఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకో ర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరో వైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జిడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

వేసవిలో తాగునీటి కొరత రాకుండా చూడాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో తాగునీటి కొరత రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం తాగునీటి ఎద్దడి లేకుండా తీసుకోనున్న ముందస్తు చర్యలు, వేసవి ప్రణాళికపై అధికా రులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరాపై పూర్తి సమాచారం ఎప్పటికప్పుడు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు మునిసిపాలిటీల్లో కమిషనర్లు తాగునీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో నీటి కొరత రాకుండా ఈదులపూసపల్లి రహదారిలో ఉన్న చెరువును ముందస్తుగా నీటితో నింపాలన్నారు. తాగునీటి కోసం నిర్మిస్తున్న ట్యాంకర్లు, పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 1491 ఓహెచ్ఎస్ఆర్‌ల కింద 1.73 లక్షల నీటి సరఫరా నల్లా కనెక్షన్లు ఉన్నాయన్నారు. 1700 హ్యాబిటేషన్లకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరందుతు న్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సవ్ టొప్పో, ఎం.డేవిడ్, జిల్లా అధికారులు రమాదేవి, సన్యాసయ్య, నర్మద, సురేందర్, కృష్ణారెడ్డి, హరిప్రసాద్, మునిసిపల్ కమిషనర్లు ప్రసన్నారాణి, రాజు, మున్వర్ అలీ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశం అనంతరం సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

మహబూబాబాద్ రూరల్, జనవరి 23 : మహబూబాబాద్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ భూక్య మౌనిక మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు మళ్లీ అవకాశం వస్తుందో.. లేదోకానీ గత ఐదేళ్ల పాలనలో గ్రామాలు మరింత అభివృద్ధి చెందాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందన్నారు. మళ్లీ అవకాశం వస్తే ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుని వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. సర్పంచ్ బోడ లక్ష్మణ్ మాట్లాడుతూ.. తమతండా కొత్తగా గ్రామపంచాయతీగా ఏర్పడడంతో తనకు సర్పంచ్‌గా అవకాశం వచ్చిందన్నారు. దీంతో ప్రజలకు సేవచేసే భాగ్యం కలిగిందని చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ నీరు వస్తుంది కానీ అక్కడక్కడ కాలువలకు గండ్లు పడడంతో నీరు వృథాగా పోవడంతో పాటు చెరువులు నిండడం లేదని సభా దృష్టికి తీసుకువచ్చారు. ఇరిగేషన్ అధికారి మాట్లాడుతూ... వారం రోజుల్లో ముగ్గురు ఏఈలతో కలిసి ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య మాట్లాడుతూ అయోధ్య, శనిగపురం గ్రామశివారుల్లో ఎస్సారెస్పీ కాలువలను రియల్ వ్యాపారులు పూడ్చివేశారని సభ దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్.మహబూబ్‌పాషా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాయని చెప్పడంతో చిన్నకిష్టాపురం సర్పంచ్ రవి స్పందిస్తూ గత ప్రభుత్వం గురించి ఇప్పుడు ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. తర్వాత ఈనెల 31తో పదవీకాలం ముగియనుండడంతో సర్పంచులను ఎంపీపీ భూక్య మౌనిక సన్మానించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో హరిప్రసాద్, సర్పంచులు బోడ లక్ష్మణ్‌నాయక్, షఫీయొద్దీన్, పర్కాల వెంకన్న, బాలు, అవుల కుమారివెంకన్న, రెడ్యా, గుగులోతు లక్ష్మి, ఆంగోతు కాంతికిషన్‌నాయక్, బాలాజీ, ఎంపీటీసీలు కొండపల్లి రాంచంద్రమ్మ, రాంచంద్రు,రాయపాటి శ్రీపాల్‌రెడ్డి, అధికారులు తిరుపతిరెడ్డి, రాజశేఖర్, శ్రీకాంత్, తిలక్ పాల్గొన్నారు.

'టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి'

బయ్యారం, జనవరి 23 : వచ్చే వార్షిక పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డీఈవో రామారావు సూచించారు. వెంకట్రాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ముఖ్యంగా ఎస్సెస్సీ విద్యార్థులపై ప్రత్యేకమైన దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందించాలన్నారు. విధుల పట్ల సమయపాలన పాటిస్తూ సమయానుగూనంగా సిలబస్ పూర్తయ్యేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. హెచ్ఎం లింగరాజు, ఉపాధ్యాయులు వీరన్న, రమేష్, ఖాజా పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వాహనం బోల్తా

నెల్లికుదురు, జనవరి 23 : గంజాయిని తరలిస్తున్న వాహనం బోల్తాపడిన ఘటన నెల్లికుదురు మండలంలోని మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. మహబూబాబాద్ నుంచి తొర్రూరు వైపు బోలేరా వాహనంలో గంజాయి తరలిస్తున్నారని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందడంతో అధికారులు వాహనాన్ని వెంబడించారు. ఆ వాహనం డ్రైవర్ నెల్లికుదురు మండలంలోని బంజర స్టేజీ వద్ద లక్ష్మీపురం వైపుదారి మళ్లించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే అధికారులు గంజాయి వాహనాన్ని లేపి, తొర్రూరుకు తరలించారు.

వెంక్యాతండాలో అగ్నిప్రమాదం

కేసముద్రం, జనవరి 23 : మండలంలోని ధర్మారంతండా శివారు వెంక్యాతండాలో సోమవారం రాత్రి కున్సోత్ బాబు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగినట్లు ఆర్ఐ బాబు తెలిపారు. తండాకు చెందిన వారందరూ తండాలో అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అన్నదానం చేస్తుండడంతో ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోంచి మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, వస్తువులు, కంప్యూటర్, ప్రింటర్, 2 తులాల బంగారం, 40 తులాల వెండి, మూడు క్వింటాళ్ల ధాన్యం, బట్టలు ఇతర సామగ్రి వెరసి రూ.9 లక్షల విలువైన వస్తువులు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

'ఎంపీ స్థానం ఆదివాసీలకే కేటాయించాలి'

నెహ్రూసెంటర్, జనవరి 23 : మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఆదివాసీలకే కటాయించాలని ఆదివాసీ ఐక్య కార్యచరణ జేఏసీ జాతీయ చైర్మన్ చంద లింగయ్య దొర అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం ఆదివాసీ ప్రజాసంఘాల రాజకీయ మేథోమథనం నిర్వహించారు. వట్టం ఉపేందర్, పొడియం బాలరాజు, కుంజ దుర్గ, ముత్తిరాజు, నర్సింగరావు, వట్టం నారాయణదొర, వాసం రామకృష్ణ, పులి శ్రీను పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

నెహ్రూసెంటర్, జనవరి 23 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అసంక్రమిత వ్యాధుల పట్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం పలురికార్డులను పరిశీలించి వైద్యులకు సలహాలు, సూచనలు చేశారు. డాక్టర్ విజయ్‌కుమార్, రాజు, గీత, వసంతరాణి, రామకృష్ణ, రత్నకుమారి, పుష్పలీల, సువర్ణ, కిరణ్, రమ్య, నర్మద, నితిన్, దీపిక, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

'ఖజానాను కొల్లగొట్టిన మాజీ సీఎం కేసీఆర్'

మహబూబాబాద్ టౌన్, జనవరి23 : తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి తన ఖజానాను నింపుకున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్ విమర్శించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో మంగళవారం వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమగడ్డ మానుకోట సత్తాచాటాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ బెల్లయ్యనాయక్ మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఉమా, బండి శ్రీనివాస్, నీరుటి సురేష్ నాయుడు, శంతన్‌రామారాజు, రాందాసు, ప్రసాద్, శివ, రజినికుమార్, వెంకన్న, హరిసింగ్, అమరేందర్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలు చట్ట సభల్లో ఉండాలి

మరిపెడ : ప్రశ్నించే గొంతుకలు చట్ట సభల్లో ఉండాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడలోని ఆడిటోరియంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించగా, తీన్మార్ మల్లన్నతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ ఆదివాసీ సంఘ వైస్‌చైర్మన్ బెల్లయ్యనాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, ఖలీల్, తాజుద్దీన్ తదితరులు ఉన్నారు. జాతీయ కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీతోనే కులగణన సాధ్యమని తీన్మార్ మల్లన్న అన్నారు. మానుకోట జిల్లా బీసీ సంక్షేమ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షుడు రజనీ, సుదర్శన్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగాని వేణు, డాక్టర్ రాకేశ్, మారగాని బాలకృష్ణ ఉన్నారు.

ఇంకా ఏడు రోజులే..

(3వ పేజీ తరువాయి)

నెలకొంది. చాలా గ్రామాల్లో సర్పం చులు తమ సొంత డబ్బులను, అప్పులు తీసుకువచ్చి సిబ్బ ది వేతనాలు, నిర్మాణపనులను చేపట్టారు. ఈ బిల్లులన్నీ వారికి రావాల్సిఉంది. ఇదిలా ఉండగా ఒక్కో చిన్న జీపీల్లోనే రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉన్నాయి. జీపీ నిధులతో చేసిన పనులు ఎంబీ రికార్డు పూర్తయి ఆన్‌లైన్‌లో సమర్పించినప్పటికీ ఖాతాల్లో నిధులు లేకపోవడంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి.

'మహాసభలను విజయవంతం చేయాలి'

ఇనుగుర్తి, జనవరి23 : తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభలను ఉపాధ్యాయులు, విద్యావంతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండలశాఖ అధ్యక్షుడు గుండు సురేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11,12 తేదీల్లో ఖమ్మం జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు ఇనుగుర్తితోపాటు నుంచి, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరై మహాసభలు విజయవంతం చేయాలని ఆయన అన్నారు. అనంతరం మహాసభల విజయవంతం కోసం ముద్రించిన మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కదిరె ప్రభాకర్, సారంగపాణి, యాకయ్య, యాదగిరి, ప్రవీణ్, సమ్మిరెడ్డి, పాషా, నారాయణ, దేవేందర్, శిరీష పాల్గొన్నారు.

కళానైపుణ్యాలను వెలికితీయాలి

● కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ముఖేష్‌కుమార్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 23 : విద్యార్థుల్లో దాగిఉన్న కళానైపుణ్యాలను వెలికితీయాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ముఖేష్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్ కేంద్రీయ విద్యాలయంలో కేద్రీయ విద్యాలయ సంఘటన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నేతాజీసుభాస్ చంద్రబోస్ జయంతిను సందర్భంగా జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలు అందజేయగా, పాల్గొన్న ప్రతీ విద్యార్థికీ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జడ్జీలు రాజశేఖర్, శ్రీనివాసులు, నారాయణ. ఉపాధ్యాయులు క్రాంతికుమార్, నారాయణసింగ్, పాష పాల్గొన్నారు.

● మహబూబాబాద్ టౌన్ : మాతృభూమి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ యువతకు స్ఫూర్తిదాయకమని సబ్‌రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్ అన్నారు. మానుకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గూడూరుకు చేరిన సైకిల్ యాత్ర

● పాల్వంచ నుంచి నాసిక్ యాత్ర చేస్తున్న మహేష్‌రెడ్డి



గూడూరుకు చేరిన మహేష్‌రెడ్డి సైకిల్‌యాత్ర

గూడూరు, జనవరి 23 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వాంచ నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు ఓ కానిస్టేబుల్ సైకిల్‌యాత్ర చేపట్టారు. ఈ సైకిల్‌యాత్ర మంగళవారం గూడూరుకు చేరుకుంది. పాల్వాంచ కేటీపీ ఎస్‌లో టీఎస్‌పీఎస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బాల్నె మహేష్ రెడ్డి పద్నాలుగు రోజులు సెలవు పెట్టారు. ఆధ్యాత్మిక చింతన కోసం తాను సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నాడు. రోజుకు 150 కిలోమీటర్ల చొప్పున వారం రోజులు సైకిల్‌యాత్ర చేసి 1200 కిలోమీటర్లు పూర్తి చేసి నాసిక్ చేరుకోనున్నారు. దారిలో ఉండే ఆలయాల్లో ఆశ్రయం తీసుకుంటున్నట్లు చెప్పారు. తిరుగు ప్రయాణం బస్సు ద్వారా తమ ఇంటికి చేరుకోనున్నట్లు స్పష్టం చేశారు.

'పది' ఫలితాల్లో అగ్రస్థానంలో నిలపాలి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 23 : పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మాను కోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోమంగళవారం జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ 2024- నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు.నాయకులు ఇస్లావత్ లచ్చిరాంనాయక్, తుడి వెంకటేశ్వర్లు, సమ్మెట వెంకటేశ్వర్లు, మందుల శ్రీరాములు, బాలాజీనాయక్, వెంకటేశ్వర్లు, స్వప్న, వాహిద్, సిరినాయక్, కోట్యానాయక్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ-టీఎస్ డైరీ ఆవిష్కరణ..

మానుకోట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్ టీచర్స్-తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూ-టీఎస్) 2024 నూతన సంవత్సర డైరీని ఎమ్మెల్యే మురళీనాయక్ ఆవిష్కరించారు. నాయకులు సంకా బద్రినారాయణ, కళ్లెం వెంకట్‌రెడ్డి, భూక్య రామోజీ. మురళీధర స్వామి, హల్యానాయక్, ఉమాదేవి, కనకయ్య వెంకన్న, ఈశ్వర్‌కుమార్, ప్రవీణ్, సునిత, శేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తితోనే రాజ్యాధికారం

● కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ



కేజీకేఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న రమణ

కేసముద్రం, జనవరి 23 : బలహీనవర్గాలను ఏకంగా చేసి గోల్కొండ కోటను ఆక్రమించుకున్న సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితోనే ఉద్యమించి రాజ్యాధికారం సాధించాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ. రమణ అన్నారు. కేసముద్రం లక్ష్మీసాయి గార్డెన్స్‌లో సంఘం ఆధ్వర్యంలో గౌడ ఆత్మీయ సమ్మేళనం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో రాష్ట్రవ్యాప్తంగా 5వేల క్యాలెండర్లను ముద్రించిన సమ్మయ్యగౌడ్‌ను ఆహుతులు అభినందించారు. ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి డాక్టర్ ఉమ, జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, బండారు దయాకర్, గోపమ్మ, మాజీ సొసైటీ అధ్యక్షుడు బండారు వెంకన్న, మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ కదిరె సురేందర్, రాధిక, సర్పంచులు గంధసిరి స్వరూప, కదిరె స్రవంతి, బబ్బురు ఉప్పలయ్య, మోడెం వెంకటేశ్వర్లు, చిర్రయాకాంతంగౌడ్, సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, మాచర్ల ప్రసాద్, మోడెం రవీందర్‌గౌడ్, చీకటి వేలాద్రి, గంధసిరి వెంకన్న, మండలంలోని గీతకార్మికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ఇంగ్లీష్‌లో శంకర్‌కు డాక్టరేట్



గూడూరు, జనవరి 23 : కొల్లాపురం శివారు రెడ్యాతండాకు చెందిన దేవాసోత్ శంకర్‌కు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను శనివారం ప్రకటించింది. ఇంగ్లీష్‌లో 'అమితివ్ ఘోష్ సెలక్ట్ ఫిక్షన్ ఎస్టడీ ఇన్ హిస్టరీకల్ పర్‌స్పెక్టివ్' అనే అంశంలో సిద్ధాంత గ్రంథం ప్రొఫెసర్‌డాక్టర్ మేఘనరావు పర్యవేక్షణలో పూర్తి చేసినందుకుగాను ఆయనకు కేయూ డాక్టరేట్‌ను ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ పట్టాను కేయూలో ప్రొఫెసర్ బన్న అయిలయ్య చేతుల మీదుగా అందుకున్నాడు. శంకర్‌కు డాక్టరేట్ రావడం పట్లతండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

బోధనతో పాటు సామాజిక సేవలు చేయడం అభినందనీయం

● ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్



విద్యార్థులకు మహనీయుల పుస్తకాలను అందజేస్తున్న జాటోతు రాంచంద్రునాయక్

సీరోలు, జనవరి 23 : ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుగులోతు కిషన్‌నాయక్ విద్యార్థులకు బోధన చేయడంతో పాటు.. సామాజిక సేవలు కూడా చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. కొత్తూరు (సీ) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ కూతురు అర్చన జ్ఞాపకార్థం విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కిషన్‌నాయక్ తన కూతురు అర్చన పేరు మీదుగా 20మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు పూలె, సావిత్రిబాయిపూలె, మొదలగు మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అంజేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న, బెల్లయ్యనాయక్, హెచ్ఎం ఇస్లావత్ లచ్చిరాంనాయక్, సర్పంచ్ యానాల గంగాధర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య, న్యాయవాది కొప్పుల రమేష్, గ్రామపెద్దలు వెంకన్న, కృష్ణారెడ్డి, వేణు, మల్లూర్, మంగీలాల్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ రద్దుపై హైకోర్టును ఆశ్రయించిన సభ్యుడు

కేసముద్రం, జనవరి 23 : ఇటీవలె ప్రభుత్వం విడుదల చేసిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ రద్దు ఉత్తర్వులపై మార్కెట్ కమిటీ సభ్యుడు (డైరెక్టర్) జాటోత్ హరీష్‌నాయక్ హైకోర్టును మంగళవారం ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 నెలల పదవీకాలం ఉన్నప్పటికీ నోటీసులు ఇవ్వకుండా కమిటీని రద్దు చేశారని తెలిపారు. గతంలో బోయిన్‌పల్లి, వరంగల్ మార్కెట్ కమిటీలను ఇలాగే రద్దు చేయగా ఉత్తర్వులపై కోర్టు స్టే ఇచ్చిందని, దీని ప్రస్తావిస్తూ కేసు వేసినట్లు తెలిపారు. తమ పదవీకాలం పూర్తయ్యేంత వరకు కొనసాగించాలని కోరారు.

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 23: జిల్లాలో జనవరి 25న అన్ని పోలింగ్ స్టేషన్లలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఎన్నికల విభాగం అధికారులతో జాతీయ ఓటర్ల దినోత్సవంపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల దినోత్సవాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, అందులో అధికారులు, ప్రజాప్రతినిధులు,ఓటర్లు పాల్గొని ఓటుహక్కు విశిష్టతను తెలియజేయాలన్నారు. స్వీప్ నోడల్ అధికారి సన్యాసయ్య, డీపీవో హరిప్రసాద్, ఎన్నికల విభాగం అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా నిరుద్యోగ జేఏసీ కమిటీ ఎన్నిక

తొర్రూరు, జనవరి 23 : మహబూబాబాద్ జిల్లా తెలంగాణ విద్యార్థి జేఏసీ నూతన కమిటీని మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్ తెలిపారు. జిల్లా చైర్మన్‌గా పంతం విజేందర్, ప్రధాన కార్యదర్శిగా వెలిశాల శ్యామ్, ఉపాధ్యక్షుడిగా పంతం సురేందర్, కార్యదర్శిగా వేల్పుగొంగ సురేష్, సంయుక్త కార్యదర్శిగా రాజులను నియమించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా విజేందర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా విద్యార్థి జేఏసీని నడుపుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్‌కు, ఓయూ నిరుద్యోగ జేఏసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నారా లోకేష్ ఏపీ సీఎం అవుతారు..

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు రాంచందర్‌రావు

కురవి, జనవరి 23 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అవుతారని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు జోస్యంచెప్పారు. కందికొండలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ చిన్న వయస్సులోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ కార్యకర్తల సంక్షేమానికి సంక్షేమ నిధిని స్థాపించి అపదలో ఉన్న ఎంతోమంది కార్యకర్తలను ఆదుకున్నారని ఆయన సేవలను గుర్తు చేశారు. దారవత్ వెంకటేష్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రేమ్‌చంద్‌వ్యాస్, సతీష్, ప్రమోద్, సుమన్, హరిరామ్, ప్రియ, సుమలత పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను అపహరించిన వ్యక్తి అరెస్టు

డోర్నకల్, జనవరి 23 : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని శ్రీవీరాంజనేయ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఈనెల 4వ తేదీన అపహరణకు గురైన ట్రాక్టర్ కేసులో ఒకరిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 4న రాత్రి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద పార్కింగ్ చేసిన మహేంద్ర ట్రాక్టర్‌ను డోర్నకల్ మండలం గుర్రాలకుంటకు నూనావత్ శివ అనేవ్యక్తిఅపహరించుకుపోయాడు. దీంతో ట్రాక్టర్ యాజమాని దాసరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు, సిబ్బందితో కలిసి గొల్లచర్ల శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ఉన్న వ్యక్తి శివ అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాక్టర్ దొంగతనం చేసిన విషయాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ట్రాక్టర్ అపహరించుకుపోయిన శివను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కేసును ఛేదించిన ఎస్సై సంతోష్‌రావు, కానిస్టేబుళ్లు ఆర్. సైదులు, జి.వీరన్నను డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'జోడో న్యాయయాత్ర ర్యాలీని అడ్డుకోవడం అవివేకం'

గార్ల, జనవరి 23 : అస్సాం రాష్ట్రంలో రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్రలో భాగంగా ఆలయంలోకి వెళ్లే సమయంలో బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడం అవివేకమని టీపీసీసీ మాజీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య విమర్శించారు. మంగళవారం గార్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమమావేశంలో ఆయన మాట్లాడారు. తాళ్లపల్లి కృష్ణాగౌడ్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్, జహర్‌లాల్ నాయక్, విఠల్‌నాయక్ పాల్గొన్నారు.

● బయ్యారం : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రను అడ్డుకోవడం సిగ్గుచేటని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య అన్నారు. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. కాగ్రెస్ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు రమేష్, వెంకటేశ్వర్లు, భాస్కర్, నాయకులు మల్లయ్య, సత్తిరెడ్డి, నిర్మలారెడ్డి, కేతమల్లు, లింగయ్య, సుమన్, వీరన్న, విష్ణు, మోహన్‌రావు, బాబురావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, భద్రయ్య, నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

తొర్రూరు, జనవరి 23 : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగిన యూనియన్ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ తొర్రూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా కె.భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా డి.యాకూబ్, ఉపాధ్యక్షుడిగా పి.నర్సింహ, స్వామి, ఎం.లలిత, కోశాధికారిగా అజయ్, కార్యదర్శులుగా ఎ.లక్ష్మణ్, రఫి, రాజు, సవితతో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. రంజిత్, నాగమల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

'చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలి'

డోర్నకల్, జనవరి 23 : గత ఏడాది కురిసిన వరదలకు దెబ్బతిన్న డోర్నకల్ మండలంలోని చెక్‌డ్యాంలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అధికారులను ఆదేశించారు. ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద వరదలతో దెబ్బతిన్న మున్నేరు చెక్‌డ్యాంను మంగళవారం పరిశీలించారు. అనంతరం డోర్నకల్‌లో నూతనంగా నిర్మించిన జైన మందిరాన్ని సందర్శించారు. అలాగే డోర్నకల్‌లో రేషన్‌డీలర్లు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. మండలనాయకులు మాద శ్రీనివాస్, తాల్లూరి హనుమ, సుమీర్‌చంద్ జైన్, జగదీష్, బత్తుల శ్రీనివాస్, కాసం శేఖర్, శంకర్, నాగరాజు, కృష్ణమూర్తి, బిక్షానాయక్, రాయల వెంకటబాబు, జవ్వాజీ రాంప్రసాద్, సురేందర్, జైన మతపెద్దలు మహేందర్‌కుమార్‌జైన్, పదంకుమార్ జైన్ ఉన్నారు.

● కురవి : బలపాలలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మాట్లాడారు. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, మాలోతు నెహ్రూనాయక్, డాక్టర్ కేశవరావు, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, అంబటి వెంకటనారాయణ, బిక్కునాయక్, బత్తుల నాగన్న, రజినీకాంత్, మొగిలిచర్ల నాగేశ్వర్‌రావు, రావూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

మహబూబాబాద్ టౌన్, జనవరి 23 : హైదరాబాద్‌లో ప్రభుత్వ, సీఎం సలహాదారులుగా నియామకమైన వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డిభరత్‌చందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మంగళవారంమర్యాదపూర్వకంగాకలుసుకున్నారు. వేంకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సత్యపాల్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, మిట్టకంటి రాంరెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి, చిట్టెం వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, నగేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, వీరస్వామి, పాల్గొన్నారు.

● మహబూబాబాద్ టౌన్ : హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను వేర్వేరుగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

● తొర్రూరు : వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

తొర్రూరు : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్షుడు జంజిరాల నాగరాజు సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు హరిబాబు, అరుణ్‌కుమార్, మహేందర్, రమేష్, రాజు, కల్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.